# సిద్దిపేట సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేట నూతన పోలీసు కమిషనర్‌గా డాక్టర్ బి.అనురాధ సోమవారం సీపీ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. అంతకు ముందు సీపీ డా॥ అనురాధ పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అడిషనల్ డీసీపీలు అందె శ్రీనివాస్‌రావు, ఎస్.మల్లారెడ్డి, ఎఆర్ అడిషనల్ డీసీపీలు రామ్ చంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు సురేందర్‌రెడ్డి, రమేష్, సతీష్, ఎస్‌బి ఏసీపీ రవీందర్‌రాజు, ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు, ఎస్ఐల సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. డీసీపీలు, ఏసీపీలతో సమీక్షా నిర్వహించి జిల్లా భౌగోళిక పరిస్థితులు ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదవుతాన్నాయి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.



## మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

# స్థానికులకే ఏఎంసి చైర్మన్ కేటాయించాలి

**ములుగు, జనవరి 8 (ప్రభాతవార్త):**
వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని స్థానికులకే కేటాయించాలని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు భద్రయ్య కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పార్టీలోనే ఉంటూ పార్టీ కోసం కష్టపడ్డామన్నారు. గ్రామంలో ఎవరికి ఆపద వచ్చినా తోచిన విధంగా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది నాయకులు పార్టీలు మారారు కానీ గత 30 సంవత్సరాలుగా తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉంటున్నానని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గీతారెడ్డి మంత్రిగా పనిచేసిన సమయంలో మార్కెట్ నిర్మాణానికి తమ గ్రామానికి చెందిన వారి నుండి ప్రభుత్వం భూములు తీసుకొని మార్కెట్ నిర్మించిందన్నారు. కానీ మార్కెట్ కమిటీలో స్థానికులకు మాత్రం ఇప్పటి వరకు అవకాశం దక్కలేదన్నారు. ఏదిఏమైనా స్థానికులకే చైర్మన్ పదవి ఇచ్చేవిధంగా జిల్లా డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు.

# జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



జిల్లా పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

**-సమస్యల పరిష్కారంపై దృష్టి సారిద్దాం**
**-జడ్పీ సమావేశంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 8, ప్రభాతవార్త:**
ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంటుందని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. సోమవారం సంగారెడ్డిలో జిల్లా పురిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. పంచాయితీరాజన, విద్య, వైద్యం, వ్యవసాయం,నీటిపారుదల, ఉపాధి హామి, పశుసంవర్ధకం, ఆర్అండ్‌బి తదితర శాఖలపై సమావేశంలో చర్చి నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు శాసన మండలి సభ్యులు, ఎంపిపి అధ్యక్షులు, జడ్పీటిసి సభ్యులు పలు సమస్యలపై సభలో కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నీటి సరఫరా, పారిశుద్యం పనులు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడి కేంద్రాలు సమయ సారణి పాటించేలా చూడాలని పంచాయితీ కార్యదర్శులు, ఎంపిడిఓలు, జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామి పనులు, ఇంజనీరింగ్ పనులు సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే పనుల్లో ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ సహకారం ఉండాలని పేర్కొన్నారు. సంగారెడ్డి శాసన సభ్యులు చింత ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొనసాగించాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. నారాయణఖేడ్ శాసన సభ్యులు సంజీవరెడ్డి మాట్లాడుతూ సమస్యలు ఏవి ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. గ్రామాల్లో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రాజా పాలనలో స్వకరించిన ధరఖాస్తులను పరిశీలించి అర్హులకు పథకాలు అందించాలన్నారు. నిధుల విడుదల పార్టీలకు అతీతంగా పారదర్శకంగా కేటాయించాలని, అధికారులు బేదాభిప్రాయాలు చూడకుండా పని చేయాలని కోరారు. సభ ప్రారంభానికి ముందు జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొనసాగించాలని తీర్మానం ప్రవేశ పెట్టగా జడ్పీ చైర్మన్ ఆమోదం తెలుపగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి బలపర్చారు. సమావేశంలో ఎంపి బిబి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎంఎల్‌సి యాదవరెడ్డి, ఎంపిపిలు, జడ్పీటిసి స్యులు,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

**-పదో తరగతి విద్యార్థుల భవిష్యత్‌కు ఒక గట్టి పునాది**
**-వార్షిక పరీక్షలు ముగిసే వరకు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా పని చేయాలి : జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ విద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంఈవోలు, ఎంఎన్ఓలు, సిహెచ్ఎంలు, ఉపాధ్యాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచడంతో పాటు వార్షిక పరీక్షలు ముగిసే వరకు ఏ ఒక్క ఉపాధ్యాయుడు సెలవు తీసుకోకుండా పని చేయాలన్నారు. జిల్లా విద్యాధికారితో పాటు మండల విద్యాధికారి, పాఠశాలల హెచ్ఎంలు, సిబ్బంది ,ఉపాధ్యాయులు వార్షిక పరీక్షలు ముగిసే వరకు ప్రతి నెల వారీగా టూర్ డైరీని తయారు చేసుకొని తమ సంతకంతో తనకు నివేదిక అందించాలని అదేశించారు. ప్రతి పాఠశాలలో 5+1 అనే సూత్ర ప్రాయంగా ఉపాధ్యాయుడు బోధన చేయాలన్నారు. 5 రోజులు ట్రాన్సాక్షన్ 1 రోజు అసెస్మెంట్ చేయాలని సూచించారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ సంబంధిత పోర్టల్‌లో ప్రతిరోజు ఎఫ్ఎల్ఎన్, ఉన్నతిలలో విద్యార్థుల హాజరు శాతం ఇతరత్రా వివరాలను తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. రోజు వారిగా అటెండెన్స్ వివరాలను యాప్‌లో అప్లోడ్ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత విద్యా సంవత్సరం మాదిరిగానే ఈ విద్యా సంవత్సరంలో కూడా సిద్దిపేట జిల్లాను రాష్ట్రంలోనే పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. పదో తరగతిలో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచి ఉదయం 8-30 నుంచి 9-30, సాయంత్రం 4-45 నుంచి 5-45 వరకు రెండు తరగతులు అదనం గా తీసుకొని స్టడి హవర్స్, డౌట్స్ లాంటివి ఎలాంటివి లేకుండా రోజు ఒక పరీక్ష కూడా నిర్వహించాలన్నారు. పదో తరగతి భవిష్యత్‌కు ఒక గట్టి పునాది అని తెలిపారు. ప్రతి 15 రోజులకోమారు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో లైబ్రరీ పీరియడ్ తప్పనిసరిగా కేటాయించాలని పిల్లలకు రైటింగ్ ప్రాక్టీస్ తప్పనిసరి అన్నారు. సమావేశంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కో-అర్డినేటర్ భాస్కర్ పాల్గొన్నారు.

# జిల్లాలో శాంతిభద్రతల పరిక్షణకు కృషి చేయాలి

**-జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్**


కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన నూతన సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట రూరల్, జనవరి 8, ప్రభాతవార్త:**
జిల్లాలో శాంతిభద్రతల సంరక్షణకై కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన డా॥అనురాధకు సూచించారు. సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వహించిన డాక్టర్ అనురాధ బదిలీపై సిద్దిపేట సీపీగా వచ్చారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.

## నిర్ధిష్టి గడువులోగా సిఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి

**-వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి**


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 8, ప్రభాతవార్త:**
రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపించి, కోటా మేరకు ఎఫ్‌సీఐకి బియ్యం నిల్వలు చేరవేసాలా పర్యవేక్షణ జరపాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వార జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీఎంఆర్ ప్రగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21వరకుఎఫ్‌సీఐ గడువు పొడిగించినందున నిర్ణీత సమయంలోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్లవు చేరేలా చూడాలన్నారు. అభయహస్త ధరఖాస్తులను సకాలంలో డేలా ఎంట్రీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో 3లక్షల 83వేల 979 ధరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వచ్చిన ధరఖాస్తులలో 1 లక్షకు పైగా ఈపాటికే అప్‌లోడ్ చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, డిఎస్ఓ వనజాత, డిపిఓ సురేష్ మోహన్, డిఆర్ఓ నగేష్, సివిల్ సప్లై డిఎం సుగణబాయి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ఎమ్మెల్యేను కలిసిన జడ్పీటిసి

**గజ్వేల్ టౌన్, జనవరి 8 (ప్రభాతవార్త):**
దుబ్బాక నియోజకవర్గ శాసనసభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డిని గజ్వేల్ జెడ్‌పిటిసి పంగ మల్లేశం సోమవారం హైద్రాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త ప్రభాకర్‌రెడ్డికి వారి ఫోటోను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


కొత్త ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న పంగ మల్లేశం

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**సిద్దిపేట కలెక్టరేట్‌లో...**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యమని జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారు మాట్లాడారు. అర్జిదారుల నుంచి తీసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలని వారు అధికారులను అదేశించారు. ప్రజావాణి కార్యక్రమంపైన నమ్మకం పెరిగిందని క్రమక్రమంగా అర్జిదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, జిల్లా అధికారులు తదితురులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి కలెక్టరేట్‌లో...**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 8, ప్రభాతవార్త:** ప్రజా వాణిలో ప్రజలు అందచేసిన ధరఖాస్తులను త్వరితి గతిన పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చిన ధరఖాస్తులను డిఆర్ఓ నగేష్‌తో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ తమ శాఖలకు సంబంధించిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరస్కరించిన ధరఖాస్తులకు సవివరమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో 72 ధరఖాస్తులు వచ్చినట్లు, అందులో 30 రెవిన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయన్నారు. ఇతర శాఖలకు సంబంధించి 42 ధరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ నగేష్, ఏఓ పరమేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా


ప్రజా వాణిలో ధరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

# శ్రీ కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఘనంగా లక్ష బిల్వార్చన


స్వామి వారి అలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు


బిల్వార్చన కార్యక్రమంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

**కొమురవెల్లి, జనవరి 8, ప్రభాతవార్త :**
కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి అలయంలో సోమవారం అలయవర్గాలు అత్యతంత భక్తి శ్రద్దలతో స్వామి వారికి లక్ష బిల్వార్చన సందర్భంగా శ్రీ మహాగణపతిపూజ, గౌరిపూజ, శివ పణ్యాహవాచనము, అఖండ దీప స్థాపన, శ్రీ పంచాచార్య గురు కలశస్థాపన, నవగ్రహ వాస్తు సప్తమాతృకో ఏకాదశ రుద్రస్థాపన అపూర్వక ప్రధాన కలశ స్థాపన పూర్వక శివ యాగ మంటపస్థాపన నూతన ఉత్సవమూర్తులకు సంప్రోక్షన నిర్వహించుకొని స్వామి వారికి తదతర కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష బిల్వార్చక మహా హరిత, మంత్ర పుష్పం కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలు వీరశైవ అగమోక్త ప్రకారముగా అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ:సంతోషాలతో జీవనం సాగించేందుకు స్వామి వారు అనుగ్రహహించాలని కోరుతూ పూజలు నిర్వహించినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణం మరుసటి రోజు అలయ సంప్రదాయ మేరకు లక్ష బిల్వార్చన పూజలను మల్లన్న అలయం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజల్లో అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, అలయ అధికారులు పాల్గొన్నారు. రానున్న సంక్రాంతి పర్వదినం అనంతరం వచ్చే మొదటి అదివారం రోజున పట్నం వారంతో తిరిగి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

# రుణాల ప్రతిపాదనలు ఆమోదానికి పంపాలి

**-జిల్లా స్థాయి టెక్నికల్ కమిటికి కలెక్టర్ సూచన**


బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 8, ప్రభాతవార్త:** రైతులకు ఎంత మేర పంట రుణాలు ఇవ్వగలిగితే రైతులకు ప్రయోజనం కల్గుతుందో జిల్లా స్థాయి టెక్నికల్ కమిఇ నిర్ణయిస్తూ ప్రతిపాదనలు రాష్ట్ర స్థాయి టెక్నికల్ కమిటికి ఆమోదానికి పంపాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి కమిటికి బాధ్యులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందింలో డిసిసిబి ఆధ్వర్యంలో బ్యాంకర్లు, ఆయా అధికారులు, రైతులతో జిల్లా స్థాయి టెక్నికల్ కమిటి సమావేవం నిర్వహించారు. సమావేశంలో 2024-25 సంవత్సరంలో ఏ పంటకు ఎంత రుణాలు ఇవ్వాలన్న దానిపై బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు, రైతులు చర్చించి నిర్ణయానికి వచ్చారు. ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి టెన్నికల్ కమిటీకి ఆమోదం కొరకు పంపాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. సమావేశంలో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల ఎల్డిఎంలు, డిసిసిబి సీఈఓ శ్రీనివాస్ నాబార్డు ఏజీఎం కృష్ణతేజ, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఏబీసీడీ వర్గీకరణపై నిర్లక్ష్యం వీడి వెంటనే చట్ట బద్దత కల్పించాలి

**-వర్గీకరణ సాధించే వరకు బలమైన పోరాటాలు చేస్తాం**
**-టిఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నూతన ఉపాధ్యక్షులు : భూపాల్**

**మిరుదొడ్డి, జనవరి 8, ప్రభాతవార్త :**
టిఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భూపాల్ మాదిగను నియమిస్తూ సోమవారం మాదిగ రిజర్వేషన్ కోట సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌లు నియమిస్తూ నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైనా భూపాల్ మాట్లాడుతూ గత 30 యేండ్లుగా ఏబీసీడీ వర్గీకరణ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించిన న్యాయమైన డిమాండ్‌ను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని నరేంద్రమోడీ హామీ ఇచ్చిన అమలు చేయడం లేదన్నారు. ఏబీసీడీ వర్గీకరణ చేయడంలో కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా చిన్న చూపు చూస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో వర్గీకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఏబీసీడీ వర్గీకరణ జరిగితేనే మాదిగ, మాదిగ ఉప కులాల కుటుంబాల్లో వెలుగులు నిండుతాయన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం జిల్లాలో బలమైన ఉద్యమాలు చేపడుతామన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగ, మాదిగ ఉప కులాలు కలిసికట్టుగా పోరాటాలకు సిద్దం కావాలన్నారు. తనపై నమ్మకం ఉంచి టిఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి గుర్రాల శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


టిఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం పత్రాన్ని అందుకుంటున్న భూపాల్

# కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గజ్వేల్, జనవరి 8 (ప్రభాతవార్త):**
కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అవగాహన కల్పించేందుకు వికసత్ భారత్ సంకల్ప యాత్ర స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం గజ్వేల్ మండలం బెజుగామలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ డైరెక్టర్ డిఎఫ్ఎస్ సురేందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌తో పాటు మహిళలకు ఎస్‌బిఐ ద్వారా ఇస్తున్న రుణాలు తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన పోచమ్మ అనే మహిళ టిబితో బాధపడుతుండగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు నెలల పాటు మందులు వాడి టిబి నయం చేసుకోవడం జరిగిందని డిఎంఅండ్‌హెచ్ఓ కాశినాథ్ సురేంద్రసింగ్‌తో కలిసి ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేసి మోడి ప్రసంగాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, ఏడిఏ బాబురావు, యుబిఐ ఆర్ఎం వికాస్, ఎస్‌బిఐ ఆర్ఎం అరుణజ్యోతి, గజ్వేల్ ఎస్‌బిఐ ఎడిబి బ్రాంచి మేనేజర్ సుజాత, డిఎంఅండ్‌హెచ్ఓ కాశినాథ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీనివాస్, ఎపిఎం యాదగిరి, వెటర్నిటీ వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ అండాలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎఫ్ఎస్ సురేందర్‌సింగ్

# కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే లాస్య



:రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చరిత్రపుటలో నిలిచే విధంగా ఉన్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత తెలిపారు. మారేడ్‌పల్లి మండలం పరిధిలోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో 4, అల్లాడి పెంటయ్య నగర్‌లో 1, వాల్మీకి నగర్‌లో 1 కళ్యాణ లక్ష్మీ చెక్కులను సోమవారం ఆమె ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా పాలనలో అభయ హస్తం పథకంలో దర ఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నివేదిత, బత్తుల నారాయణ, సురవి శ్యామ్ సుందర్ రెడ్డి, తేలుకుంట సతీష్‌గుప్త, పెద్దాల నర్సింహ్మ, భాస్కర్ ముదిరాజ్, శివకుమారి, పనస సంతోష్, ఎస్.రాము, అజయ్, రాంమోహన్, దాసరి కర్ణకుమార్, మురళీ యాదవ్, మల్లేశ్, సుషాంత్ రెడ్డి, భవాని మాధురి తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఓసీ పత్రాలను అందజేసిన లాస్య..** 7వ వార్డులో నివాసం ఉంటున్న శ్రీదేవికి మెరుగైన వైద్యం కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు నాయకులు కె.బి.శంకర్, ఖదిర్‌వన్‌లు పాల్గొన్నారు.

# ట్యాంక్‌బండ్‌పైన పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించాలి: శ్రీనివాస్‌గౌడ్



నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆయన జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పైన అవిష్కరించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విగ్రహానికి సంబంధించిన అన్ని పనులు పూరైయినాయని ఆగస్టు మాసంలో జరిగే పాపన్న జయంతి రోజును విగ్రహాన్ని ఆవిష్కరించాలని, భారసా ప్రభుత్వ హాయంలో పాపన్న జయంతి, వర్ధంతిలను అధికారపూర్వకంగా నిర్వహించడం జరిగిందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గౌడ ఐక్య సాధన సమితి రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ కులస్థులకు వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల్లో 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో ఎంతో కష్టపడి గౌడ్‌ల అభివృద్ధి, సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని వివరించారు. అలాంటిది తనపైన గత ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి ఎక్కటై తనను ఓడించాయని ఆరోపించారు. కుల వృత్తుల వారి కోసం ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ భవనాలు ప్రభుత్వం పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, వివిధ సంఘాల నాయకులు రామ్మోహన్‌గౌడ్, బబ్బూరి బిక్షపతిగౌడ్, ఎడుకొండలు, నర్సింహ్మగౌడ్, ప్రసాద్, మానస తదితరులు పాల్గొన్నారు.

# బస్టాపులో ఇతర వాహనాలు ఆపొద్దు

**వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు**



ఆర్టీసి, ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్

సికింద్రాబాద్, జనవరి 8 ప్రభాతవార్తః రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. చిలకలగూడ చౌరస్తా వద్దగల బస్టాప్ వద్ద ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండడంతో బస్సులు నడిరోడ్డుపై నిలపాల్సి వస్తుందని, దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిలకలగూడ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. బస్టాపులో ఇతర వాహనాలు నిలుపడం, బస్సులు నడిరోడ్డుపై నిలవడం లాంటి వాటి వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, అక్రమ పార్కింగ్ జరిపితే ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశం ఉందని వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే చాలాసార్లు ఆర్టీసి బస్సులు కూడా నడిరోడ్డుపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం లాంటి వాటివల్ల వెనకాల ఉండే ఇతర వాహనదారులు ఆలాగే నిలిచిపోవాల్సి వస్తోందని, ఆర్టీసి బస్సులు కూడా కేవలం బస్టాపులో మాత్రమే నిలపాలని ఆర్టీసీ డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డుపక్కన వాహనాలను నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వద్ద, బోయిగూడ వద్ద రోడ్డుపై అక్రమంగా పార్క్ చేసిన వాహనాదారులకు జరిమానాలు విధించారు. గాంధీ ఆస్పత్రి గాంధీవిగ్రహం వాహనాలు నిలుపకుండా తాడుతో కోన్‌లు అడ్డుగా కట్టారు. ఈ కార్యాక్రమంలో చిలకలగూడ ట్రాఫిక్ ఎస్సై కర్ణాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



2వ వార్డులో కబ్జాకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్

## ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలి

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: ఇందిరమ్మ నగర్‌లోని రామాలయం దేవాలయం వద్ద ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించుకున్నాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆక్రమణకు గురైన స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ సోమవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుమార్ ముదిరాజ్, నాగేశ్, మహేశ్, శ్యామ్ రెడ్డి, స్వామి, రవి, నరేశ్, లాల్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలకు రానున్న నాక్ పర్యవేక్షణ బృందం

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ డిగ్రీ,పిజి మహిళా కళాశాలకు ఈ నెల 10,11 తేదీల్లో నాక్ పర్యవేక్షణ బృందం విచ్చేయనున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, చైర్‌పర్సన్ డాక్టర్ రాజశ్రీ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) కళాశాలలో పర్యవేక్షించి మౌళిక సదుపాయాలు, గ్రంథాలయాలు, ల్యాబ్‌లు, వివిధ విభాగాల పనితీరు, అధ్యాపకుల బోధన, ఎన్‌సీసీ, ఎన్.ఎస్.ఎస్, కార్యకలాపాలను పరిశీలించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి పాలక మండలి చైర్‌పర్సన్ డాక్టర్ రాజశ్రీ, కో-ఆర్డినేటర్ జి.సునందలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్‌గా వడ్డేపల్లి నర్సిహ్మా




కుత్బుల్లాపూర్, జనవరి 8 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్‌గా వడ్డేపల్లి నర్సింహ్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఉపకమిషనర్‌గా పని చేసిన నాగమణి బదిలీపై సంతోశ్‌నగర్ సర్కిల్‌కు బదిలీకాగా సంతోశ్‌నగర్ సర్కిల్‌లో ఉప కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వడ్డేపల్లి నర్సింహ్మ కుత్బుల్లాపూర్ సర్కిల్(25)బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వడ్డేపల్లి నర్సింహ్మ మాట్లాడుతూ ఇప్పటినుండి కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్‌లో ప్రతిసోమవారం ప్రజా వాణి కార్యక్రమం విధిగా నిర్వర్తిస్తామని తెలిపారు. పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని ఇతరుల ప్రవేయం అవసరం లేదని సూచించారు.

# అయ్యప్పస్వామి శరణుఘోషతో మారుమ్రోగిన గాంధీనగర్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజోత్సవ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ వై.అమృత, రచనశ్రీ, కొంతెం దీపిక, విశ్వేశ్వరయ్య, బిఆర్ఎస్ నాయకులు ఎంఎన్.శ్రీనివాసరావు, యువనేత ముఠాజై సింహా, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బిజెపి నాయకులు ఆనంద్, వెంకటేశ్, మహేందర్‌బాబు, కలకోట అరుణ్‌కుమార్, శివాముదిరాజ్, విశ్వహిందుపరిషత్ రాష్ట్ర నాయకులు, పలువురు ప్రముఖులు, స్థానిక డివిజన్ మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్పస్వామి భజన పాటలతో భక్తిపారవశ్యంతో భక్తుల 'అయ్యప్ప శరణుఘోష'తో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ కార్యక్రమానికి ముందు అయ్యప్పస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహిళలపై హింసను అరికట్టండి

**ప్రొఫెసర్ ఎస్.శాంతకుమారి**




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతకుమారి తదితరులు

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: మహిళలపై హింజను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ చైర్‌సర్సన్ ప్రొఫెసర్ ఎస్.శాంతాకుమారి అన్నారు. ఈమేరకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌వోజిఎస్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 66వ ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫన అంబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 2024 లో భాగంగా సోమవారం –"ధీర –మహిళలపై హింసను అరికట్టండి "అనేఅంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు మార్గనిర్దేశం చేసేందుకు సహాయం చేయడానికి ఎఫ్‌వోజిఎస్ఐ సభ్యులు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 9నుంచి 11ఏళ్లగల పిల్లలకు మహిళల హింసపై చైతన్యం కలిగించేందుకు రెండుగంటల ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం భౌతికంగా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని ఇప్పటివరకు దాదాపు 3700 పాఠశాలలను కవర్ చేశామన్నారు. ఈప్రోగ్రాం కోసం తాము యునిసెస్‌తో కలిసి భారతదేశంలోని అన్ని పాఠశాలల్లో ఈకార్యక్రమాన్ని తప్పనిసరి చేయడమే లక్ష్యం గా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రియాంకదత్, విహాబ్ సిఈవో దీప్తిరావు, ప్రొఫెసర్ అనీబిట్రైన్ కిహారా, డాక్టర్ జయదీప్, డా.మాధురీపటేల్ పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలి**




పసంగిస్తున్న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ కోరారు. కల్లుగీత రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి. రమణ అధ్యక్షతన సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్లుగీత కార్మిక సంఘం శుభాకాంక్షలు తెలిపింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వృత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు గ్రామపంచాయితీ తీర్మాణం ఆధారంగా ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు 30 రోజుల్లో ఇస్తామని, జనగాం జిల్లాకు పాపన్నజిల్లాగా మారుస్తామని, పెన్షన్ ప్రస్తుతమిస్తున్న గీత కార్మికులతో పాటు 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి రూ.4వేలు చేయూత పెన్షన్, బెల్ట్‌షాపుల రద్దు చేస్తామని చెప్పడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పడం, గీత కార్మికులకు ఉపాధి మెరుగుపర్చడం, కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి బలోపేతం చేయడం, వృత్తిలో ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్‌నుంచి వచ్చే ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని, ప్రతి కల్లుషాపుకు ఐదెకరాల భూమి, ఏజెన్సీ ఏరియాలోని కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకటనర్సయ్య, పామన గుండ్ల అచ్చాలు, వెంకట మల్లయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, బూడిద గోపి, ఎస్.రమేశ్‌గౌడ్, బండకింది అరుణ్, మడ్డి అంజిబాబు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులఉు మారగాని కృష్ణస్వామి, బోయపల్లి సుధాకర్‌గౌడ్, ఆశన్యగౌడ్, మెరుగు సత్యనారాయణ, మోగేం వెంకటేశ్వరున్ల, రాచకొండ వెంకట్‌గౌడ్, సురుగు రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణయుగ స్వరకర్తలకు స్వరాభిషేకం'

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: అలనాటి మేటి పాటలు నేటికి అజరామరం అని సినీ విజ్ఞానవిశారద ఎస్వీ.రామారావు అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావవేదికలో శోభా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వర్ణయుగ స్వరకర్తలకు స్వరాభిషేకం' కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత్రి, వ్యాఖ్యాత్రి శోభారాణి ఆధ్వర్యంలో జరిగింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈ గాన కార్యక్రమం అద్భుతంగా సాగింది. తెలుగు చలనచిత్ర రంగంలో పేరు ప్రఖ్యాతలను సంపాదించిన స్వరకర్తలకు సంబంధించిన పాటలను గాయనీ గాయకులు శ్రీకాంత్, దుర్గాసౌజన్య, రమాదేవి, రవికుమార్, విజయకుమార్, రామ్మోహన్‌రావు, సంధ్యారాణి, శ్యామల, వెంకటేశ్వరరావు, వెంకటరావు, లక్ష్మి, అశ్విన్‌కుమార్ తదితరులు అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ విజ్ఞానవిశారద ఎస్వీ.రామారావు హాజరై అద్భుతంగా గానం చేసిన వారిని సత్కరించి అభినందించారు.

# మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

**సిఎం రేవంత్‌రెడ్డికి కుటుంబ సభ్యుల వినతి**



సిఎంను కలిసి మల్లికార్జున్ సతీమణి భాగ్యలక్ష్మీ, కుమారుడు మను

హైదరాబాద్ జనవరి 8,ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమనాయకుడు, మాజీ కేంద్రమంత్రి దివంగత డాక్టర్ మల్లికార్జున్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కుటుంబసభ్యులు వినననవించారు. ఈమేరకు సోమవారం మల్లికార్జున్ సతీమణి భాగ్యలక్ష్మి, కుమారుడు మను రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రదేశంలో డాక్టర్ మల్లికార్జున్ విగ్రహ నెలకొల్పడం ద్వారా దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో ఆయన చేసిన కృషిని గుర్తించాలని అభ్యర్థించారు. కాగా డాక్టర్ మల్లికార్జున్ ఇందిరాగాంధీ, పి.పి నర్సింహ్మరావు మంత్రివర్గంలో పనిచేశారు. డిఫెన్స్, రైల్వే వంటి కీలకమైన పోర్టుపోలియోలో నిర్వహించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో కీలకపాత్ర పోషించడంతోపాటు మహబూబ్‌నగర్ నుంచి నాలుగు సార్లు లోక్‌సభకు, రెండుసార్లు మెదక్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీష్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, మాజీఎంపిపి ముదప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించాలి

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలని ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సర్వ సభ్యసమావేశం డిహెచ్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ ఫౌండర్ నల్ల సోమలన్న మాట్లాడుతూ ఫార్మసిస్టులకు ప్రభుత్వం తగిన స్థానం కల్పించాలని, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. కాగా ఈ సందర్భంగా సమావేశం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవ అధ్యక్షుడిగా సోమలన్న, అధ్యక్షుడిగా శ్యామ్‌వడ్డే రాజ్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వీరేష్‌బాబు, సలహాదారులుగా పరాబ్‌కుమార్, పాండు, కవిత, ఉపాధ్యక్షులుగా కే.రామచంద్రుడు, రామచంద్రరావు, సునీత, హయగ్రీవాచారి, బుజ్జి, అరుణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా ఆలీ, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగరాజు, పి.స్వర్ణలత, మహేష్, ప్రీతి ఎన్నికైనారు.

# ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఢీపీఎస్,పల్లవి స్కూల్స్ చైర్మన్ మల్కాకొమురయ్య

తార్నాక, జనవరి 8 ప్రభాతవార్త: పల్లవి మోడల్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలను నయనోత్సాం,ఉల్లాసంగా జరుపుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన వివిద సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటక,సాహిత్య,నైపుణ్యాలను అబ్బుతంగా ప్రదర్శించారు. మరో వైపు జుంబా డ్యాన్స్ మరింత ఆకట్టుకుంది. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఎన్.రామచందర్ రావు, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ డీన్ విజయఖాదర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ, క్రీడలతో పాటు ఇతర రంగాల్లో మంచి శిక్షణ నిస్తున్న పల్లవి,ఢీపీఎస్ విద్యాసంస్థల కృషి గొప్పదన్నారు. విద్యార్థులు చదువులో రాణించి స్కూల్‌కు, తల్లితండ్రులకు, దేశానికి పేరు తీసుకొని రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఢీపిఎస్, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ తమ స్కూల్స్‌లల్లో పిల్లలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో శిక్షణనిస్తామని చెప్పారు. అసోసియేట్ వైస్ ప్రసిడెంట్ ఆగ్నా పెర్నాండేజ్, చైర్మన్ మల్లాకొమురయ్య, నోబల్ డైరెక్టర్ కార్తీక్, అకాడమి డైరెక్టర్ సుధ, స్కూల్ ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లితండ్రులు హాజరయ్యారు.



హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో ప్రముఖ కాస్‌ప్లేయర్లు మేధా శ్రీవాత్సవ, జోహైర్‌ఖాన్ వర్క్‌షాప్ నిర్వహించారు

# బండి రమేష్‌కు అభినందనలు వెల్లువ

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 8, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ నరసాపూర్ చౌరస్తాలో ఉన్న కో ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఎంఎస్ఎంఈ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా స్థల విషయంపై ఆయనతో చర్చించడం జరిగింది. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్‌రావుగౌడ్, సెక్రటరీ సురేంద్రబాబు, సభ్యులు మహేష్ అగర్వాల్, మధుసూదన్, దిలీప్ రమేష్, శంకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయండి

**సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి**



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 8, ప్రభాతవార్త: కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు శక్తివంచనతో కృషి చేయాలని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు సోమవారం హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేద ప్రజానీకానికి సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి సాధిసుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సేరి సతీష్‌రెడ్డి, కె.దినేష్‌కుమార్, అరవింద్‌రెడ్డి, డి.కృష్ణ, రాజేష్, కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ అనిల్‌రెడ్డి, రాజు, కృష్ణ, సహీం, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించుకుందాం

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



ముషీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త: జనవరి 18వ తేదీ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావుగారి 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించుకుందామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా పిలుపునిచ్చారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి రోజున ఎన్టీఆర్ ఉదయం 9గంటలకు నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారని, అనంతరం 10గంటలకు రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రక్తదాన శిబిరం, అనంతరం దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు పోలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ కమిటీ నాయకులు, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆరోజు స్థానికంగా ఎన్టీఆర్ చిత్రపటానికి లేదా విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. అదే విధంగా కార్యకర్తలు, నాయకులు అందరూ ఎన్టీఆర్ వర్ధంతి రోజున పేదలకు అన్నదానాలు, పండ్లపంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, యాదగిరి పాల్గొన్నారు.

**సామాజిక న్యాయ అసమానతలను**

# ప్రతిబింబించే నాటకం దేవుని ఎదుట



నాంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : నేటికీ మన సమాజాన్ని పీడిస్తున్న సామాజిక న్యాయ అసమానతలపై ఆలోచనాత్మకంగా ప్రతిబింబించేలా, రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యక్తులతోసహా సంపన్నులకు అనుకూలంగా, ధనిక పేద దొంగలపట్ల న్యాయవ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తోందని బహిర్గతం చేసే కథాంశంతో ప్రతీఒక్కరినీ ఆలోచించేటట్లు నటీనటులు అద్భుతంగా ప్రదర్శించిన నాటకం దేవుని ఎదుట ఆకర్షణీయమైన కథనంతో విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సెంటర్ ఫర్ ఆర్ట్స్ మీడియా అండ్ సోషల్ వెల్ఫేర్ నిర్వహణలో ఆరుద్ర రచన, డా. అల్తాఫ్ హసన్ ప్రొడక్షన్ డిజైన్, సమ్మెట వెంకటరమణ దర్శకత్వంలో నటులు అర్జున్, చైతన్య, పవన్‌కళ్యాణ్, శివ, నవనాథరెడ్డి, కిరణ్‌మయూరి, చందు, వెంకటేష్, దుర్గ ముఖ్యపాత్రలో సజీవంగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

## క్యాంపు కార్యాలయంలో పూజలు నిర్వహించిన మంత్రి



క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్,జనవరి08,ప్రభాతవార్త**

హుస్నాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పూజా కార్యక్రమం నిర్వహించారు.హుస్నాబాద్ శాసనసభ్యులుగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా క్యాంపు కార్యాలయానికి వచ్చి పూజ ముగించుకుని కార్యాలయంలో అడుగు పెట్టారు.ఇక నుండి తన క్యాంపు కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తను అందుబాటులో ఉన్న సమయంలో క్యాంపు కార్యాలయంలోనే కలుసుకోవచ్చన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా క్యాంపు కార్యాలయానికి రావచ్చని అందుబాటులో తాను లేకుంటే పార్టీ కార్యకర్తల ద్వార సమాచారం అందిస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

### సమస్యల పరిష్కారమే ధ్యేయంగా
## నూతన కార్యవర్గం పని చేయాలి
**-బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం**



సిద్ధిపేట నూతారి పెద్ద సంఘం నూతన కార్యవర్గం

**సిద్దిపేట రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :**

భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన కార్యవర్గం పని చేయాలని బిఎన్అర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం సిద్దిపేట సుతారి పెద్ద సంఘం నూతన కార్యవర్గాన్ని బిఎన్అర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం అధ్వర్యంలో సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సూతారి పెద్ద సంఘం పట్టణ అధ్యక్షులుగా తోట్ల నర్సింలు, ఉపాధ్యక్షులుగా తాటికొండ ఉప్పలి, ప్రధాన కార్యదర్శిగా దరిపల్లి ఎల్లయ్య, కోశాధికారిగా తోట్ల బాలకిషన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం బిఎన్అర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు దరిపల్లి చంద్రం మాట్లాడుతూ ప్రతి కార్మికుడు లేబర్ కార్డును తీసుకోవాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. 1996 చట్టం ప్రకారం భవన నిర్మాణ రంగాల కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అందేలా సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఉల్లిగడ్డల పెద్ద రంగయ్య, కోడూరి లక్ష్మయ్య, సద్ది రాములు, నూకల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేద్దాం



మండల బిజెపి కార్యవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

**కోహేడ, జనవరి 8, ప్రభాతవార్త :**

పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ అధ్యక్షులతో కలిసి అయా బూత్‌ల లో క్షేత్రస్థాయిలో మండల, జిల్లా స్థాయి నాయకులు పాలుపంచుకొని పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల మధ్యనే ఉండాలని కోహెడ మండల పార్లమెంట్ ఎన్నికల ఫుల్ టైం ప్రభారీ సికింద్రాబాద్‌కు చెందిన ఎనగందుల సందీప్ సూచించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ అదేశాల మేరకు కోహెడ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు ఖమ్మం వెంకటేశం అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన పాల్గొని మాట్లాడారు. మూడు నెలల పాటు కష్టపడి పని చేసి దేశంలో మూడోసారి నరేంద్రమోడీని ప్రధానమంత్రిగా చేద్దామన్నారు. ఫిబ్రవరి నుంచి నేను సైతం కోహెడలోనే ఉంటూ ఒక కార్యకర్తగా మీతో కలిసి పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అర్ఎస్ఎస్, బిజెపి నాయకులు నరేందర్‌పాల్, ఖమ్మం వెంకటేశం, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, జగన్‌యాదవ్, శ్రీనివాస్, రజినీకాంత్‌రెడ్డి, హరిదాస్,వెంకటేష్, వెంకటేశ్వర్లు, సాగర్‌రావు, కరుణాకర్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శేఖర్, కిష్టారెడ్డి, నవీన్‌చారి, చంద్రం, శ్రీనివాస్, రమేష్, సుధాకర్, సుమన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎంపిపి

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):**

మండలంలోని ఎర్రవల్లిలో అంగన్‌వాడీ నూతన భవనాన్ని ఎంపిపి పాండుగౌడ్ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, స్థానిక సర్పంచ్ భాగ్య బిక్షపతితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆట వస్తువులు, కుర్చీలు, టేబుల్స్‌ను దాతల సహకారంతో గ్రామ సర్పంచ్ భాగ్య బిక్షపతి సుమారు రూ.3 లక్షలతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎర్రవల్లి అంగన్‌వాడీ కేంద్రం మిగతా అంగన్‌వాడీ కేంద్రాలకు మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, ఆయమ్మ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ కనకయ్య, వార్డు సభ్యులు శేఖర్, భాగ్య శ్రీశైలం, సుజాత యాదగిరి, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కొమురయ్య, రఘుపతిరెడ్డి, పాండు, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి పాండుగౌడ్

# నర్సాపూర్ ఇంచార్జీ మున్సిపల్ చైర్మన్‌గా నయీమొద్దీన్

**నర్సాపూర్, జనవరి 8.ప్రభాతవార్త:**

నర్సాపూర్ ఇంచార్జీ మున్సిపల్ చైర్మన్‌గా ఎండి నహీమొద్దీన్ ను నియామకం చేశారు.సోమవారం నర్సాపూర్ మున్సిఫల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ ,కౌన్సిలర్‌ల సమక్షంలో నర్సాపూర్ ఇంచార్జీ మున్సిఫల్ చైర్మన్‌గా నహిమొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నర్సాపూర్ మున్సిఫల్ చైర్మన్‌గా విదులు నిర్వహించిన మురళీయాదవ్ పై 9 మంది కౌన్సిలర్ లు అవిశ్వాస తీర్మాణం నోటీసును అదనపు జిల్లా కలెక్టర్ రమేశ్ కు అందజేసిన విషయం పాఠకులకు తెల్సిందే.అయితే అవిశ్వానికి 9 మంది కౌన్సిలర్ లు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ ముందుగానే స్వచ్ఛందంగా రాజీనామా చేసిన విషయం కూడ తెల్సిందే.మురళీయాదవ్ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌కు రాజీనామా చేసిన రాజీనామా పత్రాన్ని మున్సిఫల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ ద్వార జిల్లా కలెక్టర్ కు అందజేయడం జరిగింది. జిల్లా కలెక్టర్ మున్సిఫల్ చైర్మన్ గా ఉన్న మురళీయాదవ్ రాజీనామా ను ఆమోదించడం తో నర్సాపూర్ మున్సిఫల్ వైస్ చైర్మన్ గాఉన్న నహిమొద్దీన్ కు ఇంచార్జీ మున్సిఫల్ చైర్మన్ గానియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నర్సాపూర్ ఇంచార్జీ మున్సిపల్ చైర్మన్‌గా నహిమొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. నర్సాపూర్ ఇంచార్జీ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఎండి.నహిమొద్దీన్ ను పలువురు అభినందించారు. ఈమేరకు నర్సాపూర్ మాజీ మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ పలువురు కౌన్సిలర్ లు, అభిమానులు, నాయకులు ,కార్య కర్తలు శాలూవాలతో, పూల మాలలతో ఇంచార్జీ మున్సిఫల్ చైర్మన్ నహిమొద్దీన్ ను సత్కరించారు.ఈకార్యక్రమంలోమున్సిఫల్ కమీషనర్ వెంకట్ గోపాల్, ,కౌన్సిలర్‌లు అశోక్‌గౌడ్, రాంచందర్, సునీతాబాల్‌రెడ్డి, లలిత బిక్షపతి, లక్ష్మినాగేశ్, సరితా ఆంజనేయులుగౌడ్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్ర శేఖర్, నాయకులు సత్యంగౌడ్, తొంట వెంకటేశ్, జ్ఞానేశ్వర్‌గుప్త,సూరారం నర్సింలు, సాగర్,రింగుల ప్రసాద్, మున్సిఫల్ మేనేజర్ మధుసూదన్, మున్సిఫల్ సిబ్బంది, ముస్లీం సోదరులు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ ఇంచార్జీ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నహిమొద్దీన్‌తో మున్సిపల్ కమీషనర్ వెంకట్‌గోపాల్ తదితరులు

## వీరాపూర్ గ్రామానికి అయోధ్య రాముడి అక్షింతలు



అయోధ్య రాముడి అక్షింతలను తీసుకవస్తున్న దృశ్యం

**బెజ్జంకి, జనవరి 8, ప్రభాతవార్త:**

వందల సంవత్సరాల నిరీక్షణ అనంతరం అయోధ్యలో భవ్య శ్రీ రామమందిర నిర్మాణం జగురుతోందని జనవరి 22న జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం యావత్ హిందూ సమాజానికి గొప్ప పర్వదినమని వీరాపూర్ సర్పంచ్ గన్నమనేని అనితసుధీర్ రావు అన్నారు. అయోధ్య రాముడి అక్షింతలు సోమవారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామానికి చేరుకోగా అటపాటలతో స్థానికంగా ఉన్న అంజనేయస్వామి అలయానికి ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజ అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేవోజు భాస్కరచారీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే తోటపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఇంటింటికి అయోధ రాముడి అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు, ముక్కిస తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విరాహత్‌అలీ సన్మాన సభను విజయవంతం చేయండి
**-టియూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి కృష్ణ**

**జగదేవ్‌పూర్, జనవరి 8 (ప్రభాతవార్త):**

టియూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విరాహత్‌అలీ సన్మాన సభను ఈనెల 10వ తేదీన గజ్వేల్‌లో నిర్వహించడం జరుగుతుందని టియూడబ్ల్యూజే సిద్దిపేట జిల్లా కోశాధికారి డి.కృష్ణ, ఐజేయూ సభ్యులు బాల్‌నర్సయ్యలు తెలిపారు. సోమవారం జగదేవ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జర్నలిస్టు జీవితంలో మూడున్నర దశాబ్దాల కాలంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఉమ్మడి మెదక్ జిల్లాలో జర్నలిస్టు సంఘం ఏర్పాటులో కీలక భూమిక పోషించారని తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా పనిచేసి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. ఈనెల 10వ తేదీన గజ్వేల్‌లోని జర్నలిస్టు కాలనీ వెల్ఫేర్ సొసైటీ, గజ్వేల్ ప్రెస్‌క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సన్మాన సభకు జర్నలిస్టులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నర్సింలు, పరశురాం, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## గొల్లకురుమలకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలి
**-ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బింగి మల్లేశం**

**జగదేవ్‌పూర్, జనవరి 8 (ప్రభాతవార్త):**

గత ప్రభుత్వ హయాంలో గొల్లకురుమలకు గొర్రెలు పంపిణీ చేస్తామని ఒక్కో యూనిట్‌కు రూ.50వేల చొప్పున డిడిలు కట్టించుకొని గొర్రెల యూనిట్‌లను మంజూరు చేయలేదని ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బింగి మల్లేశం తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గొల్లకురుమలను ఆదుకోవాలని కోరారు. గొర్రెల యూనిట్‌ల కోసం అప్పులుచేసి డిడిలు కట్టిన లబ్ధిదారులకు వెంటనే గొర్రెల యూనిట్‌లను అందించాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు చేపట్టి రాయితీపై గొర్రెలను పంపిణీ చేయాలని లేదంటే గొల్లకురుమలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతామన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

**సిద్ధిపేట రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్పోర్ట్స్‌లో సిద్దిపేట శ్రీవాణి స్కూల్‌కు చెందిన విద్యార్థి గడిచెర్ల జితీష్‌కు స్టాండింగ్ బోర్డు జంప్, రన్నింగ్ పోటీలలో (అండర్-8) లో అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2024 జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెల్‌తో సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్బంగా పాఠశాల డైరెక్టర్ సి.హెచ్.సత్యం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థి జితీష్‌కు స్కూల్ పక్షన సోమవారం మెమోంటో అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన జితీష్‌కు మెమోంటో అందించి అభినందిస్తున్న దృశ్యం

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**యాచారం జనవరి8,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రా మానికి చెందిన తెలుగుమళ్ల జంగయ్య అనారోగ్యంతో మృతి చెందాడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి భరోసా కల్పించి 75కెజీల బియ్యాన్ని మూడేడ్ల వెంకట్ రెడ్డి అందజేశారు. నిరుపేదలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.ఈ కార్య క్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్రె శ్రీశైలం,యూత్ కాంగ్రెస్ అధ్య క్షుడు ప్రశాంత్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు యాదయ్య,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ముచర్ల సాయి,మొర్రి శివ,కొండాపురం శ్రీకాంత్, వెంకటేష్,కందికంటి ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

## నారపల్లిలో అయోధ్య రాముడి అక్షింతల వితరణ

**ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ నారపల్లిలోని 15 వ వార్డులో స్థానిక నాయకులు ఇంటింటికి తిరిగి అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అయోధ్య రాముడి అక్షింతలు వితరణ చేయడం ఎంతో అదృష్టం ఉంటే తప్పా ఈ అవకాశం రాదని అన్నారు. ప్రతి హిందువు భక్తిశ్రద్దలతో అక్షింతలు స్వీకరించి పూజలు చేసి చల్లుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బవతి నర్సింహ, మందాడి నరేందర్ రెడ్డి, అబ్బవతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్‌షాప్ నిర్వాహకుడు అరెస్టు

**శంకర్‌పల్లి, జనవరి 8 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మండలంలోని ఇంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని మోకిలా పోలీసులు సోమవారం అరెస్టు చేశా రు. నిందితుడి నుంచి 91 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మోకిలా పోలీసులు తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**నందిగామ, జనవరి 8, ప్రభాతవార్త:** ఇంట్లో పని చేస్తూ ప్రమావ శాత్తు కుడి చేతి మనికట్టుకు తీవ్ర గాయాల పాలైన రంగాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు పాలకొండ అశోక్ గౌడ్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చెవుల పల్లి ప్రతా ప్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త జాండగూడెం గోవర్ధన్ గౌడ్‌లు పరామర్శించారు. అశోక్ గౌడ్ గాయాలపాలై ఆపరేషన్ చేయించుకొని ఇంటికి చేరిన సమాచారం తెలుసుకున్న వారు రంగాపూర్‌కు వచ్చి అశోక్‌గౌడ్‌ను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారు అశోక్‌గౌడ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు మండల వైస్ ఎంపిపి ఎం మం జుల ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ దేపల్లె కుమారస్వామిగౌడ్ జ్ఞానేశ్వర్ పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
**తెలంగాణ గ్రామీణ బ్యాకు మేనేజర్ నరేందర్**

**కోట్‌పల్లి,జనవరి 8, ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బార్వాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరేందర్ అన్నారు. సోమవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్, బార్వాద్‌తాండలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రమాద బీమా పథకాలు ప్రభు త్వం అందిస్తున్న పథకాలను ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ. ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండేందుకు కృషి చేసి ఎవరు వేలుముద్రలు పెట్టకుండా తమ పేర్లను నేర్చుకోవాలన్నారు. బ్యాంకులలో తీసు కున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి కొత్త రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరు ప్రమాద బీమాలు చేసుకుంటే కుటుంబానికి భరోసాగా ఉంటుందన్నారు.బిజెపి మండల అధ్యక్షులు క్రిష్ణయాదవ్, నాయకులు నర్సింహరెడ్డి, వెంక ట్‌రెడ్డి, వైద్య సిబ్బంది శ్రావణి, రవిందర్‌రెడ్డి, ప్రభావతి, లక్ష్మి, ఈశ్వ రమ్మ, బ్యాంకు సిబ్బంది వెంకట్‌రెడ్డి, సంకల్పయాత్ర సిబ్బంది తదిత రులు పాల్గోన్నారు,

## పథకాలపై రైతులకు అవగాహన

**ఆమనగల్లు, జనవరి08, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలపై రైతులకు వ్యవ సాయాధి కారులు సోమవారం అవగాహన కల్పించారు. ఏఓ అరు ణకుమారి, ఏఈఓలతో కలిసి ఆమగనల్లు రెవెన్యూ పరిధిలోని ఆమ నగల్లు, శంకర కొండతండాలలో పర్యటించి చెంచురైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా పీఎం జన్‌మన్ యోజన, రైతుభీమా, రైతు బంధు, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కల్పించారు. వాటిని పొందడానికి తీసు కోవలసిన చర్యలను వివరించారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ లేని రైతులు వెంటనే వాటిని సమకూర్చుకోవాలని సూచించారు. ఈసం దర్బంగా బ్యాంక్ సిబ్బందితో రైతులను అటాచ్ చేయడం జరిగిందని ఏఓ అరుణకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శివతేజ, ట్రైబ ల్ వెల్ఫేర్ ఆఫీసర్ నహీముద్దిన్, మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్ డాక్టర్ పరిక్షిత్, తిరుపతిరెడ్డి, శ్రీశంకర్, చెంచుజంగయ్య ఉన్నారు.

## గుడిమల్కాపూర్ మార్కెట్ సమస్యలు పరిష్కరించాలి

**మొయినాబాద్, జనవరి 8 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ మార్కెట్ సమస్యలను పరిష్కరించాలని చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ మార్కెట్ అధికారులు కోరారు. గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, రైతులతో కలిసి సోమవారం నాడు గుడిమల్కాపూర్ మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. రైతులు చెప్పిన వివరాలను మార్కెట్ కమిటీ అధికారులకు వివరించారు. జర్బరా షెడ్ ముందు ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని, రైతులు పువ్వులు అమ్ముకునే విధంగా ముందు నుంచి సిమెంటు రోడ్డు వేయాలని కోరారు. షెడ్డులో విద్యుత్ దీపాలు అమర్చాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని రైతులు భీమ్ భరత్ ఆధ్వర్యంలో అధికారులకు తెలియజేశారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు కూరగాయలు, ఆకు కూరలు తీసుకువచ్చి గుడిమల్కాపూర్ మార్కెట్‌లో విక్రయిస్తుంటారని, అటువంటి వారికి ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని కోరారు. రైతులపై జరు గుతున్న దాడుల ను నివారించవలసిందిగా పోలీస్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడి రైతులకు రక్షణ కల్పించాలని కూడా భీమ్ భరత్ మార్కెట్ అధికారులను కోరారు.

## వైభవోపేతంగా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం

**మొయినాబాద్, జనవరి 8 ప్రభాతవార్త:** చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలంలోని శేరిగూడ గ్రామంలో ఉన్న శ్రీ ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహిం చారు. ఈ మహోత్సవంలో చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి పామెన భీమ్ భరత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో అనేక ఒడిదు దుకులను ఎదుర్కొంటున్న మనిషి జీవితానికి ఊరటనిచ్చేది భగవంతుని కృప మాత్రమేనని తెలిపారు. అమ్మవారి కళ్యా ణోత్సవంలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, కొండకల్ సర్పంచ్ కాశీనాథ్ గౌడ్, షేర్‌గూడెం శ్రీనివాస్, వీరారెడ్డి, ప్రశాంత్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్, కృష్ణారెడ్డి, షేర్ అనం త్‌రెడ్డి, పెంటయ్య, శ్రీశైలం, రామచంద్ర, ఖయ్యూం, పాల్గొన్నారు.

## ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతలు

**మొయినాబాద్, జనవరి 8 ప్రభాతవార్త:** ఈ నెల 22న అయో ధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్బంగా అయోధ్య శ్రీరా ముని అక్షింతలు ప్రతి ఇంటింటికి పంపిణీ చేశారు. 500 సంవ త్సరాల కల నెరవేరుతున్నందున పండుగ వాతావరణంలో ఆ రోజు రామభక్తులంతా భక్తి శ్రద్దలతో ఈ అక్షింతలతో పూజలు చే యాలని అన్నారు. ప్రతి ఇంట దీపావళి మాదిరిగా దీపాలు వెలిగిం చి అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం విజయ వంతంగా జరిగేలా చూడాలని కోరారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి

**షాబాద్, జనవరి 8, ప్రభాతవార్త :** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తమవంతు కృషి చేస్తున్నామని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. సోమవారం షాబాద్ మండల కేంద్రంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రథమ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి
**-పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ**




పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు

**మర్కుక్, జనవరి 8 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని గణేష్‌పల్లిలో పిఆర్‌టియు టిఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మల చేతులమీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా శశిధర్‌శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పాఠశాలల్లో స్కావెంజర్‌లను నియమించాలని, సిపిఎస్‌ను రద్దు పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అర్.శ్రీనివాస్‌రావు, ఎన్.లక్ష్మినారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింలు, షాబొద్దీన్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌చారి, నాయకులు రమణారావు, దిలీప్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## మృతిచెందిన పారిశుధ్య కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి
**-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి**

**జగదేవ్‌పూర్, జనవరి 8 (ప్రభాతవార్త):**

జగదేవ్‌పూర్ మండల పరిధిలోని తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ రోజున చెరువును శుభ్రం చేయడానికి వెళ్ళి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందించలేదని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. సోమవారం గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయంలో మృతుల కుటుంబాలను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీగుల్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు అయిన బాబు, ఎల్లం, యాదమ్మల కుటుంబాలను గతంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని సహాయం చేయలేకపోతున్నామని అధికారులు చెప్పినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి సహాయం అందించలేదని, అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మాట ఇచ్చారని, ప్రభుత్వం ఆ పేద కుటుంబాలను ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక పై శిక్షణ



నర్సాపూర్ లోగ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమంలో శిక్షణనిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ తదితరులు

**నర్సాపూర్,జనవరి 8.ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామీణ పేదరిక తగ్గింపు ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళ్లికలో బాగమైనటువంటి గ్రామ పేదరిక తగ్గింపు ప్రణాళిక పై నర్సాపూర్, శివ్వంపేట,చిలిపిచెడ్ మండలాల చెందిన సిఎ లు,సిసిలు, ఏపిఎం లు పాల్గొనగా ముఖ్య అతిథిగా జిల్లా ట్రైనర్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నాన్ ఫామ్ మోహన్ పాల్గొని శిక్షణ నివ్వడం జరిగింది.ఈ శిక్షణలో బాగంగా గ్రామంలోని అన్నికుటుంబాల సభ్యులకు అర్హత ప్రణాళిక, జీవనోపాదుల ప్రణాళిక, వస్తు సేవలు, వనరుల ప్రణాళిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక అనే అంశాల పై వారికి సవివరంగా శిక్షణ నివ్వడం జరిగింది. ఈకార్యక్రమంలోజిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహన్ తో పాటు ఏపిఎం లు గౌరిశంకర్, వెంకటేశ్వర్లు, ప్రేమలత,సిసి లు దేవిసింగ్, ఆంజనేయులు,ప్రవీణ ,బాగ్య, రవిందర్, సరితా,వెంకటలక్ష్మి, వరలక్ష్మి,పురుషోత్తం, అకౌంటెంట్ మల్లేషం, ఆపరేటర్ సురేశ్ తదితరులు పాల్గోన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**నర్సాపూర్ రూరల్,జనవరి 8,ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడమే లక్ష్యమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ మురళి యాదవ్‌లు అన్నారు. సోమవారం మండల పరిధి మంతూర్ గ్రామంలో భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడు, నర్సాపూర్ కౌన్సిలర్ గొడ రాజేందర్, కౌన్సిలర్ బూచేష్ యాదవ్, మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ సంఘసాని సురేష్, మాజీ గొర్లకాపరి చైర్మన్ రాజయ్య యాదవ్, మాజీ సర్పంచి రమణారావు, నర్సాపూర్ మండల అధ్యక్షుడు నాగేష్, బిజెపి నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా, దేవేందర్ యాదవ్, నగేష్ గౌడ్, నల్ల ఆంజనేయులు, బిజెపి ఎస్సి మోర్చా ఉపాధ్యక్షులు చంద్రయ్య, బూత్ అధ్యక్షుడు మాణిక్యం, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, బిజెపి నాయకులు, ప్రజలు పాల్గోన్నారు.

## సాంకేతిక విద్యలో విద్యార్థులు రాణించాలి
**-జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి**

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 8, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దిగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. సోమవారం సంగారెడ్డిలో ప్రారంభమైన జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సును సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక మేళకువలు విద్యార్థుల వరకు చేరే విధంగా ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ సాంకేతిక విద్యా శిఖరాలను అధిరోహించడానికి ఇలాంటి ప్రదర్శనలు వేదికలుగా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




సైన్స్ ఫెయిర్ సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి



జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్

## కలెక్టర్‌కు డిసిఎంఎస్ చైర్మన్ శుభాకాంక్షలు

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని సోమవారం డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ సోమవారం సంగారెడ్డిలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలుసుకున్నారు. జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వల్లూరి క్రాంతిని మల్కాపురం శివకుమార్ కలుసుకుని పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కబ్జా చేశారు-కష్టాలు పడుతున్నాం.. న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న రైతు

**పుల్కల్, జనవరి 8, ప్రభాతవార్త:** వ్యవసాయ భూమికి వెళ్లే దారిని గ్రామానికి చెందిన మారుతి కులకర్ణి కబ్జా చేయడంతో పొలానికి వెళ్లేందుకు నిత్యం కష్టాలు పడాల్సి వస్తోందని మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన రైతు అత్కూరి విజయ్ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందచేశారు. రైతు విజయ్ కథనం ప్రకారం... గ్రామంలోని 214 సర్వే నంబర్‌లో తనకుగల వ్యవసాయ భూమికి వెళ్లేందుకు గతంలో ప్రభుత్వ నక్ష ఉండేదన్నారు. పొలం పక్కనేగల మారుతీ కుల్‌కర్ణి సదరు భూమిని కబ్జాచేయడంతో వ్యవసాయ భూమికి వెళ్లలేక అవస్థలు పడుతున్నామని, సింగూరు కాలువ ద్వారా వచ్చే సాగు నీరు రాకుండా తూమును మూసేసి ఆ నీటిని మారుతీ కుల్‌కర్ణి సొంత పొలాల్లో ఉన్న అన్నపూర్ణ రైస్‌మిల్లుకు వినియోగించుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులు విచారణ నిర్వహించి న్యాయం చేయాలని రైతు అత్కూరి విజయ్ విజ్ఞప్తి చేశారు.

## మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి : జడ్‌పిటిసి



జిల్లాపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పిటిసి సభ్యురాలు స్వప్న

**న్యాల్‌కల్, జనవరి 8, ప్రభాతవార్త:** రంజోల్ టిఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని బేగరి స్వప్న కుటుంబానికి న్యాయం చేయాలని జడ్పీటిసి సభ్యురాలు, జిల్లా సోషల్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ బోడ స్వప్నభాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బోడ స్వప్న మాట్లాడుతూ ఆదివారం జహీరాబాద్ మండలంలోని తుంకుంట గ్రామానికి బేగరి స్వప్న (17) వసతి గృహంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని బాధ్యులకు శిక్ష పడేలా చేసి స్వప్న కుటుంబానికి న్యాయం చేయాలని సభ దృష్టికి తీసుకుపోయినట్లు జడ్పీటిసి బోడ స్వప్న భాస్కర్ పేర్కొన్నారు.

## ప్రజా వేదికలో అవకతవకలు బహిర్గతం



మనూర్‌లో ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

**మనూర్, జనవరి 8, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2022-23లో 3 కోట్ల 7లక్షలతో చేపట్టిన పనులపై సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం జిల్లా అడిషనల్ పిడి వానస్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్, బోజిరెడ్డి హాజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామి పనులపై అధికారులు చేపట్టిన విచారణలో పలు అవకతవకలు ఉన్నట్లు గుర్తించి సభలో అవినీతికి బహిర్గతం చేశారు. బోరంచలో చనిపోయిన వారి పేరు మీద పనిచేసి బిల్లులు తీసుకున్నట్లు వెల్లడయింది. కూలీల సంతకాలు లేనిదే బిల్లులు చేసినట్లు అధికారులు గుర్తించారు. అలాగే పనుల రికార్డులు సక్రమంగాలేవని అధికారులు వివరించారు. ఉపాధి హామి పనుల్లో అవినీతి జరిగిన గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, కార్యదర్శులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, ఎంపిడిఓ షాజిలోద్దిన్, ఎపిఓ షాహెద్ తదితరులు పాల్గొన్నారు.

### ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాలకు

## ఈనెల 11వ తేదీ వరకు గడువు పెంపు

**నారాయణఖేడ్, జనవరి 8 ప్రభాతవార్త:** ఓపెన్ పదవతరగతి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల అడ్మిషన్లకు ఈనెల 11వ తేదీ వరకు ప్రభుత్వం దరఖాస్తులు చేసుకునేందుకు గడువుపొడిగించిందని నిజాంపేట ఓపెన్ పది ఇంటర్మీడియట్ పరీక్షల విభాగం ఇంచార్జి దేవిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతవిద్యార్థిని విద్యార్థులు ఓపెన్ పాఠశాలలో చదువుకునేందుకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగతా వివరాలకు సెల్‌నెం. 9391644170కు సంప్రదించి వచ్చున్నారు.

## మండలంలో డేటా ఎంట్రీ షురూ

**న్యాల్‌కల్, జనవరి 8, ప్రభాతవార్త:** డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీవరకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అభయహస్తం పథకంలో (5 గ్యారంటీ పథకాలు) లబ్దిపొందేందుకు చేసుకున్న ధరఖాస్తులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు న్యాల్‌కల్‌లో డేటా ఎంట్రీ షురూ అయింది. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు 14,103 కుటుంబాల వారు ధరఖాస్తులు చేసుకున్న విషయం పాఠకులకు విధితమే. ప్రజలు అందచేసిన ధరఖాస్తులను ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో డేటా ఎంట్రీ కొనసాగుతోంది. అయితే సోమవారం సైతం ధరఖాస్తులు చేసుకునేందుకు ఎంపిడిఓ మండల ప్రజలకు అవకాశం కల్పించారు. సోమవారం ఆయా గ్రామాల నుంచి ఎన్ని ధరఖాస్తులు వచ్చాయో తెలియాల్సి ఉంది.



ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను డేటా ఎంట్రీలో నమోదు చేస్తున్న ఆపరేటర్లు



మెటల్‌కుంటలో అయోధ్య రాములోరి అక్షింతలను వితరణ చేస్తున్న భక్తులు



జంగరాయిలో పెద్దమ్మతల్లి దేవాలయంవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

# గ్రామాల్లో అయోధ్య అక్షింతల వితరణ

**న్యాల్‌కల్, జనవరి 8, ప్రభాతవార్త:**

శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో మండలానికి సరఫరా అయిన అయోధ్య అక్షింతలను సోమవారం న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో భక్తులు ఇంటింటికి సరఫరా చేశారు. ఆదివారం రాత్రికి ప్రతి ఇంటి ముందు కల్లాపి చల్లి ముగ్గులు వేయాలని, ఇంటి కాడికి వచ్చిన రాములోరి అక్షింతలను మంగళహారతులతో స్వాగతం పలకాలని టాంటాం వేయడంలో ఆయా గ్రామాల్లో ప్రజలు కల్లాపి చల్లి అందమై ముగ్గులు వేశారు. న్యాల్‌కల్‌లో శ్రీరామలింగేశ్వర ఆలయంలో, మెటల్‌కుంటలో ఆంజనేయస్వామి ఆలయాల్లో సాంప్రదాయ దుస్తులు ధరించి మెడలో కాషాయ కండువాలు ధరించిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరామ జయ రామ జయజయ మహా మంత్రాన్ని స్మరిస్తూ భజనలు చేస్తూ గ్రామంలోని ఇంటింటి వెళ్లగా ఇంటి వారు మంగళహారతులతో స్వాగతం పలుకగా అక్షింతలు, రామాలయ చిత్ర పటం, ఆహ్వాన పత్రికలను అందచేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామాల్లో అక్షింతల వితరణ కార్యక్రమం కొనసాగడంతో గ్రామాలు శ్రీరామ నామ స్మరణతో మర్మోగాయి.

**జంగరాయిలో...**

**చిన్నశంకరంపేట, జనవరి 8,ప్రభాతవార్త:**



మేదపల్లిలో అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

మండల పరిధి జంగరాయి గ్రామానికి చేరుకున్న అయోధ్య రాముని పూజిత అక్షింతలకు పెద్ద తల్లి దేవాలయంలో భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించి సోమవారం గ్రామంలోని ఇంటింటికి అక్షింతలను పంపిణి చేశారు.

**కక్కరవాడ గ్రామంలో...**

**ఝరాసంగం, జనవరి 8, ప్రభాతవార్త:**

మండలంలోని మేదపల్లి, కక్కరవాడ గ్రామాల్లో సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నుంచి రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో మండలానికి చేరుకున్న అయోధ్య అక్షింతలను సోమవారం భక్తులు ఇంటింటికి సరపరా చేశారు. అక్షింతలతో ఇండ్ల కాడికి చేరుకున్న భక్తులకు ఇండ్ల వాసులు మంగళహారతులతో స్వాగతం పలికారు గ్రామంలోని ఆయా ఇండ్లకు శ్రీరాముల వారిని స్మరిస్తూ భజనలు చేస్తూ అక్షింతల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మేదపల్లి సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, కక్కరవాడ సర్పంచ్ మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేష్, మాజీ సర్పంచ్ భోజిరెడ్డి, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్ నయీమొద్దీన్‌ను సన్మానించిన సునీతారెడ్డి

## ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:** నర్సాపూర్ ఇన్‌చార్జ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎండి నయీమొద్దీన్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నయీమొద్దీన్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి నయీమొద్దీన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, మహ్మద్, రాజేశ్, కౌన్సిలర్‌లు అశోక్‌గౌడ్ పంబళ్ల బిక్షపతి, రాంచందర్, దావూద్‌ఖాన్, బాల్‌రెడ్డి, కుమ్మరి నాగేశ్, ఆంజనేయులుగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోషక పదార్ధాలున్న ఆహారంతోనే ఆరోగ్యం



జంగరాయి తండాలో అన్నప్రాసన నిర్వహిస్తున్న సీడీపీవో స్వరూప

**చిన్నశంకరంపేట, జనవరి 8,ప్రభాతవార్త:** పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణీలు పోషకాలున్న ఆహారపదార్థాలను తినాలని సీడిపివో స్వరూపా తెలిపారు. సోమవారం మండల పరిధి జంగరాయితండాలో గర్భిణీలకు సీమంతం, పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకు కూరలు, పప్పు దినుసులు, మాంసకృతులు తినాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు శివకుమారి, విజయ, ఇందిర, సరోజ పాల్గొన్నారు.

## పెండింగ్ ఈ-చలాన్‌పై భారీ డిస్కౌంట్

**సంగారెడ్డి టౌన్, జనవరి 8, ప్రభాతవార్త:**

పెండింగ్ ఈ-చలాన్‌లపై భారీగా డిసౌంట్ ప్రకటించినట్లు, ఈ నెల 10వ తేదీవరకు వాహనదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి చెన్నూరి రూపేష్ సూచించారు. ద్విచక్ర వాహనాలు ఆటోలపై 80 శాతం రాయితీ, కారు, లారీలపై 60 శాతం రాయితీ, ఆర్‌టిసి బస్సులపై 90 శాతం రాయితీ అందుకోవచ్చని ఎస్‌పి సూచించారు.

## దాతల ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, జనవరి 8,ప్రభాతవార్త:**

మండల పరిధి సూరారం గ్రామానికి చెందిన సావిత్రి,దుర్గపతి దంపతుల నివాస పూరిగుడిసే రెండు రోజులు క్రితం దగ్ధమయింది. సోమవారం మాజీ సర్పంచి చిలుకా నాగరాజు, బాధిత కుటుంబానికి రూ.2వేలు ఆర్థిక సహాయం అందించారు. ఉప సర్పంచి సిద్ధిరెడ్డిగారి గోవర్ధన్ రెడ్డి 50 కిలోల బియ్యం, వెయ్యి రుపాయల ఆర్థిక సహాయం, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ 35 కేజిల బియ్యం అందించారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**నర్సాపూర్, జనవరి 8,ప్రభాతవార్త:** ఆల్‌ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం మెదక్ జిల్లా 2024 నూతన క్యాలెండర్‌ను సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే సునీతారెడ్డి గృహంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ మేరకు ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం సభ్యులు నర్సాపూర్ లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి లను కలిసి వారి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. . ఈకార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు చాందీరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తారాసింగ్, నర్సాపూర్ డివిజన్ అధ్యక్షులు ధన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, తూప్రాన్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ చక్రునాయక్, జిల్లా సెక్రటరి కొర్ర పుణ్య, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి కళారాములు, నర్సాపూర్ డివిజన్ ట్రెజరర్ భీమ్లా, ఉపాధ్యక్షులు రాజు, రామ్‌సింగ్, హీరాశర్మనాయక్, విఠల్, దీప్లానాయక్, దుర్గాప్రసాద్, గేమ్యా, రాజు, రవి, రాజెందర్, లలిత తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## అసైన్‌మెంట్ భూముల్లోకి రావద్దు

### -వ్యకాప రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్

**ఝరాసంగం, జనవరి 8, ప్రభాతవార్త:** మండలంలోని ఎల్గోయి గ్రామంలో సోమవారం రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రామచందర్ ముఖ్య అతిథిగా హజరై గ్రామంలోని రైతులు 108 మంది హైకోర్టును ఆశ్రయించగా రెవెన్యూ అధికారులు, టీఎస్‌ఐఐసి అధికారులు రైతుల భూముల్లోకి ప్రవేశించరాదని కోర్టు తీర్పు వెలువరించిందని గుర్తు చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా రైతుల్ని బెదిరించి భయాందోళనలకు గురి చేసి చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించిన దానికి రైతులు ఉదనయమాలు, పోరాటాలు నిర్వహించిన గత ప్రభుత్వానికి కనువిప్పు కల్గలేదని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉందని, రైతులకు బయటి మార్కెట్లో పలుకుతున్న ధరను చెల్లించి రైతుల ఉంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. రైతులు కలిసి కట్టుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శంకర్, గోపాల్, యేసయ్య, అంజమ్మ, నర్సింలు, తుల్జమ్మ, రాములు, లక్ష్మి కృష్ణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రామచందర్

# కాగజ్ మద్దూర్ గాంధీ విగ్రహం వద్ద రైతులు నిరసన

**నర్సాపూర్, జనవరి 8, ప్రభాతవార్త:**

గత ప్రభుత్వ ఆదేశాలతో అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తీసుకొని రైతులను ఆదుకున్న రైస్‌మిల్ వ్యాపారి శ్రీధర్‌గుప్తకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని కాగజ్ మద్దూర్ గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులను ఆదుకోవాలని చెప్పడంతో రైస్‌మిల్ వ్యాపారి శ్రీధర్‌గుప్త పెద్దఎత్తున తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని మిల్లింగ్‌చేసి ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు నర్సాపూర్, కౌడిపల్లి మండలం తునికి, మక్త మాసాన్‌పల్లిలోని గోదాముల్లో భద్రపరిచాడని తెలిపారు. బియ్యం నాణ్యతగా లేవని ప్రభుత్వం తీసుకోకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేటికి మూడు గోదాముల్లో సుమారు రూ. 40 కోట్లకు పైగా విలువఉన్న బియ్యం మూలుగుతున్నాయన్నారు. శ్రీధర్‌గుప్త నుండి బియ్యం తీసుకోకుండా ఆయనను ఇబ్బందులు పెడుతూ ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బాకీ ఉన్నాడని అతని ఆస్తులు జప్తుచేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా న్యాయవిచారణ చేపట్టి రైతుల నుండి తడిసిన ధాన్యాన్నితీసుకొని రైతులను ఆదుకున్న శ్రీధర్‌గుప్తకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులను కోరుతున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ శంకరయ్య, రైతులు మన్మధరెడ్డి, మల్లేషం, కిష్టయ్య, గ్రామ రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కాగజ్ మద్దూర్‌లోని గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, జనవరి 8, ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన నూతన సంవత్సరం 2024 క్యాలెండర్, డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధుఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్‌ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు పాటి సత్యనారాయణ, ఐటేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు వైకుంఠరావు, ఎల్ఐజి కాలనీ అధ్యక్షులు యాదగిరిరెడ్డి, మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఒరిజినల్ కార్డు ఉంటేనే ఉచిత ప్రయాణం : డిఎం

**జహీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త:** మహాలక్ష్మి పథకంలో మహిళలు ఆర్టీసి బస్సులు ఉచితంగా ప్రయాణించేందుకు విధిగా ఒరిజినల్ ఆధార్ కార్డు ఉంచుకోవాలని జహీరాబాద్ ఆర్టీసి డిపో మేనేజర్ వెంకట సూర్య నారాయణ పేర్కొన్నారు. ఆధార్ కార్డులో ప్రయాణీకురాలి ఫొటో చిరునామ స్పష్టంగా ఉండాల్సిన అసరం ఉందన్నారు. ఆధార్ కార్డు లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదేని గుర్తింపు కార్డు (ఫోటో, చిరునామ ఉన్నవి) ఒరిజినల్‌ది చూయించినా సరిపోతుందన్నారు. మహిళా ప్రయాణీకులు స్మార్ట్ ఫోన్‌లో, ఫోటో కాపీలు కలర్ జిరాక్సులు చూయిస్తున్నారని, ఇక నుంచి అవి చెల్లవన్నారు. బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు జీఓ టికెట్‌ను తీసుకోవాలని సూచించారు.

### మున్నూరు కాపు సంఘం

## రామాయంపేట అధ్యక్షుడిగా అల్లాడి వెంకటేశం

**రామాయంపేట, జనవరి 8, ప్రభాతవార్త :** రామాయంపేట మున్నూరు కాపు శాఖ నం1 ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన అల్లాడి నారాయణ, నక్క సిద్దరాములు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అల్లాడి వెంకటేశం, ఉపాధ్యక్ష లుగా గాజుల బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా నక్క చిన్న శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కస్తూరి ఎల్లయ్య, కోశాధికారిగా బాజ రామరాజు, కార్యవర్గ సభ్యులుగా అల్లాడి మల్లేశం, నక్క పెద్ద శ్రీనివాస్, బాజ దుర్గయ్య, దేమె భూపాల్‌ను కొత్త కార్యవర్గముగా ఎన్నుకోవడం జరగింది.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**చిన్నశంకరంపేట, జనవరి 8, ప్రభాతవార్త:**



సూరారంలో కాలమాని ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఉపా ధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్జీటీయూ మండల అధ్య క్షుడు నర్సింలు అన్నారు. సోమవారం మండల పరిధి సూరారంలోని ప్రాథ మిక పాఠశాలలో ఎస్జీటీయూ కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులపై ఎల్లప్పుడూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, నర్సింలు, శ్రీనివాస్, ప్రవీణ్, శివకృష్ణ, రవి, రాజు, సురేష్, రాంచంద్రారెడ్డి, చంద్రశేఖర్, సంతోష్, మహేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.



అక్రమ కట్టడాలను కూల్చివేసిన అధికారులు

## అక్రమ కట్టడాలు కూల్చివేత

**పటాన్‌చెరు,జనవరి 8,ప్రభాతవార్త:** జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలోని కోమటికుంట సర్వే నెంబర్ 165లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ ఇరిగేషన్ శాఖల అధికారులు జెసిబి సహాయంతో కూల్చివేశారు. కూల్చివేస్తున్న సమయంలో కబ్జాదారుడు అధికారులతో వాగ్వావాదానికి దిగినప్పటికి అధికారులు మాత్రం వెనుకడుగు వేయకుండా అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల్లో చెరువులు, కుంటలు, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, హెచ్చరించారు. ఆ నిర్మాణాలను కూల్చివేయడమే గాక, సంబంధిత కబ్జాదారులపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, ఇరిగేషన్ ఏఈ దిలిప్, రెవెన్యూ ఇరిగేషన్ మున్సిపల్ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

### -రూ. 47 వేలు, నాలుగు కార్లు, రెండు బైకులు స్వాధీనం

**నాగల్‌గిద్ద/సంగారెడ్డి టౌన్, జనవరి 8, ప్రభాతవార్త:**



పోలీసుల అదుపులో జూదరులు

గుట్టుచప్పుడు కాకుండా మండల పరిధిలోని చేక్లతండాలో పేకాట ఆడుతున్న జూదగృహంపై పోలీసులు దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.47 వేలు, 4 కార్లను, 2 బైక్‌లను, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సిద్దిరాములు పేర్కొన్నారు. పోలీసు ఠాణా పరిధిలో ఎవరైనా పేకాట ఆడుతున్నట్లయితే తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ సిద్దిరాములు మండల ప్రజలకు సూచించారు. జూదగ్రస్తులపై చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## గుర్తు తెలియని మృతదేహం గుర్తింపు

**పాపన్నపేట, జనవరి 8,ప్రభాతవార్త:** ఏడుపాయల చెక్‌డ్యాంలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం... సోమవారం పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుర్తు తెలియని మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని నర్సింగ్ గ్రామానికి చెందిన కుర్మ మల్లేశం (35) గత బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులవద్ద ఆచూకికోసం గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆదివారం పత్రికలలో వచ్చిన వార్తను పరిశీలించిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా మెదక్ ఏరియా ఆసుపత్రిలోని మృతదేహాన్ని కుటుంబ సభ్యులు పరిశీలించగా మల్లేశందిగా గుర్తించారన్నారు. మృతుడికి భార్య మంజుల, ఇరువురు కుమారులు మహేష్, నితిన్‌లు ఉన్నారని, భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై మహిపాల్‌రెడ్డి వివరించారు.